ఆ గుండెల తపన

జోరున కురుస్తుంది వర్షం. దాన్ని ఎడా పెడా చెదరగొడ్తోంది. 'ఝూం'మని వీస్తున్న గాలి తుఫాను మొదలై ఆ రోజుకు అది రెండవ రోజు. అందంగా అలంకరించుకొన్న కన్నెపిల్ల నిరంకుశత్వంగా రేప్ చేయబడినట్లుంది ప్రస్తుతం ఆ ఊరి పరిస్థితి. ఇళ్లు కూలిపోయాయి. చెట్లు మొదళ్లు పైకిలేచాయి. పల్లపు ప్రదేశాల్లోని ఇళ్లు నీటిలో మునిగి కప్పులు మాత్రం కనిపిస్తున్నాయి. ఇళ్లలోని వస్తువులు నీళ్లపైకి తేలి నీటిలో కొట్టుకుపోతున్నాయి. ముందురోజే అందిన మేరకు సామాను పట్టుకొని మిద్దె ఇళ్ల పంచలలో చేరి భయంగా వొదిగి కూర్చుని ఉన్నారు పూరిళ్లలోని బీదాలిక్కు.

అది ఊరికి దగ్గరలో ఉన్న మిట్టప్రదేశం. పక్కపక్కనే అక్కడ మూడిళ్లున్నాయి. ఒక ఇంట్లో రంగయ్య, అతని భార్య. రెండవ ఇంట్లో నరసయ్య, అతని భార్య. చివరి ఇంట్లో వీళ్ల తల్లి సాయమ్మ మూడవ కొడుకు సాంబయ్యతో ఉంది. తుఫాను మొదలైనప్పటి నుండి ఎవరి యింట్లోనూ పొయ్యి రాజెయ్యలేదు. భయం వాళ్లకి ఆకలి లేకుండా చేసింది.

"నాయనా! సాంబా" మంచంమీద ఒళ్ళంతా దుప్పటి కప్పుకొని చలికి వణుకుతున్న సాయమ్మ నెమ్మదిగా పిలిచింది.

పక్కనేగోనె పట్టామీద కూర్చుని ఉన్న పదేళ్ళ సాంబయ్య "ఏందే అమ్మా. ఈడనే ఉండా" అన్నాడు వణుకుతూ.

"ఖూడు,"

"కూడు గావాల్నా అమ్మా".

నాక్కాదురా నీకేరా నాయనా. అడ అటకమీన గంజినూకలున్నాయి. కాసుకొని తాగరా.

"ఎట్టా కాసుకొనేది కింద కట్లె పుల్లలు తడిసిపోయినయి కిరసనాయిలులేదు. గంజెట్టా కాసేది."

"ఒరే సాంబా ! ఇంక నేను బతకన్రా. సలి నోట్లోనుంచి కడుపు లోకి దూరింది. ఈ తుఫాను అయ్యేటప్పటికి నాను సచ్చిరుకొంటా" నీ గతే. అంది కళ్ళనీళ్ళు పెట్టుకొంటూ.

"అమ్మా అట్టాగనకే" పెద్దగా ఏడ్చాడు సాంబయ్య.

"అనకేం సేసేదిరా పోయిన తుఫానుకే పోవాల్సింది. ఎట్నో బతికినా. ఈసారికి నేనుండను. లోకం తెలియనోడివి. ఎట్టా బతకతవో" కుళ్ళి కుళ్ళి ఏడ్చింది అరవై ఏళ్ళ సాయమ్మ.

"నువ్వు సచ్చిపోతే, నానూ సచ్చిపోతానే" పెద్దగా ఏడ్చాడు. సాంబయ్య తల్లిని పట్టుకొని.

"నాయనా అట్లాంటి మాటనకురా" ఎండిపోయిన పుల్లలాంటి చేతిని పైకెత్తి కొడుకు కళ్ళు తుడిచింది.

'బోయ్' మంటూ ఓ పెద్దగాలి ఆ ఇంటిని ఊపేసింది.

"అమ్మా భయంగా ఉందే."

"భయపడకు నాయినా నీ అన్నలుందరు గదా."

"అన్నలెవ్వరూ రాలేదే" అన్నాడు సాంబయ్య నీరసంగా.

"అట్టాగా" మూలిగింది సాయమ్మ.

అంత సేపు సాయమ్మ మాట్లాడడమే గొప్ప విషయం.

"నాయినా అట్టా సూరు కిందనేబోయి నీ అన్నల్ని పిలస్తవా."

"ఎట్టా బొయ్యేదే"

"ఎట్టాగయినా బోయిరా. నాలుగు సంగతులు సెప్పి నే కన్ను మూస్తా."

సాంబయ్య కడుపు బిగపట్టి మెల్లగా బయటకొచ్చేందుకు పైకి లేచాడు. చెక్కతలుపుకు అదిమిపట్టి వున్న పీటలాగాడు.

'బోయ్'మని ఈదురుగాలి సాంబయ్యను ఇంట్లోకి విసరికొట్టింది. యింటి మధ్యకు వచ్చిపడింది వర్షపుజల్లు. 'అమ్మో' అంటూ దుప్పటి పూర్తిగా కప్పుకొంది సాయమ్మ వణికిపోతూ.

సాంబయ్య అతి కష్టంమీద చెక్క తలుపును అదిమిపెట్టి పీట దాని కానించాడు. తరువాత కొద్దిసేపు తమాయించుకొని నెత్తిన గోనె కప్పు కొన్నాడు. చూరులోంచి బయటకు చూసాడు. వర్షం, గాలి భయంకరంగా ఉంది వాతావరణం. కొద్దిసేపు ఓపిక పట్టాడు. గాలి వేగం తగ్గినట్లు అనిపించగానే చప్పున తలుపులు తీసి బయటకువచ్చి బయట గొళ్లెం పెట్టాడు.

తలుపు దబదబమని శబ్దమయ్యేసరికి "ఎవరదీ" అన్నాడు సాయమ్మ పెద్దకొడుకు. తలుపును ఈదురుగాలి అదే పనిగా నెట్టేస్తుంటే తలుపుకు దగ్గరలో మంచం వేసుకొని కూర్చుని దానికి వీపు ఆనించి ఉన్నాడు.

"నేను సాంబడ్ని" పెద్దగా అరిచాడు బయటనుంచి సాంబయ్య.

"ఏందిరా ఇట్లా వచ్చినవు" తలుపు తీయకుండానే అరిచాడు రంగయ్య.

"నూకలు కావాలేమో. ఏడుండయి లేవని చెప్పు" అంది అతని భార్య.

"అన్నా! శానా సంగతులు చెప్పాల నీతో తలుపు తియ్యి" మళ్ళీ అరిచాడు.

ఇక రంగయ్యకు తలుపు తీయక తప్పలేదు. సాంబయ్య లోపలికి రాగానే మళ్ళీ తలుపు దగ్గరకేసి మంచం దానికి ఆనించాడు.

సాంబయ్య చొక్కా, నిక్కరు తడిసి గజగజ వణుకుతున్నాడు. నెత్తిమీద జుట్టులోంచి నీళ్ళు బొట్లు బొట్లుగా కారుతున్నాయి.

అన్నా....అమ్మ....నచ్చిపోయేట్టుంది. మీతో ఒకమాట సెప్పాలంట రమ్మంది."

"ఆ...." అన్నాడు రంగయ్య భయంగా.

"అవునన్నా! నోట మాట సరిగ్గా రావడంలేదు. తొందరగా నువ్వు అమ్మ దగ్గరకి ఎల్లన్నా. నేను చిన్నన్నని పిలుస్తాను." అంటూ బయటకు వచ్చాడు.

రంగయ్య భార్య నిలువునా నీలుక్కుపోయింది. సాయమ్మత్త రెండేళ్ళ క్రిందట తుఫాన్లో సచ్చిపోవాల్సింది. సచ్చిపోలా. ఈ తుఫాన్లో కచ్చితంగా సచ్చిపోద్ది. అంటే.... 'అమ్మో ఎంతన్యాయం' అనుకొంది. ఇదే ఆలోచన వచ్చింది రంగయ్యకు కూడా. వాళ్ళకు గతం కళ్ళముందు కదలాడింది.

* * * *

రెండేళ్ళ క్రిందట కూడా సాయమ్మ ఇలాంటి విషమ పరిస్థితినే ఎదుర్కొంది. అపుడు సాయమ్మ తన ముగ్గురు కొడుకులు, ఇద్దరు కోడళ్ళతో ఉమ్మడి కుటుంబంగా జీవిస్తోంది. ఏటా తుఫాన్లు రావడం, చెరువులు తెగడం మామూలై కూర్చొంది. ఆ రోజు కురుస్తున్న భారీ వర్షానికి అందరూ ఒకచోట కూర్చుని మాట్లాడుకొంటున్నారు.

ఆ రాత్రి సాయమ్మ ఆయాసం ఎక్కువై మూలుగుతూ చావు బతుకుల్లో ఉంది. అప్పుడు అందరూ తలా ఒక మంచం మీద కూర్చుని సాయమ్మ పరిస్థితికి విచారిస్తున్నారు.

సాయమ్మ మూలుగుతూ "అమ్మో సచ్చిపోతున్నాను నేనింక బతకను. హూ.... హూ...." అంటోంది. మాట్లాడుతుంటే ఆయాసం ఎగదన్నుకొని వస్తోంది.

రాత్రి పదయింది. సాయమ్మ పరిస్థితి మరీ క్షీణించింది. ఆమె గొంతులోంచి గురగుర తప్ప మరేమీ మాటలు రావటంలేదు. ఆకలికి ఉండలేక ఇంట్లో ఉన్న బియ్యం వండుకొని తలా కొద్దిగా తిన్నామని పించారు. ఆ తుఫానులో రోజుకు ఒక్కపూటే భోజనం.... అదీ పచ్చడి మెతుకులు.

సాయమ్మ చిన్న కొడుకు సాంబయ్య మాత్రం అన్నం ముట్టుకో లేదు. అన్నలు, వదినలు బ్రతిమాలినా వినకుండా ఏడుస్తూ తల్లి దగ్గరే కూర్చుని ఉన్నాడు.

రాత్రి సరిగ్గా పన్నెండు గంటల సమయంలో ఎవరో పెద్దగా తలుపు తట్టగా సాయమ్మ పెద్దకొడుకు వెళ్లి తలుపుతీశాడు. ఎదురుగా నరసరాజు. తడిసిన పంచె అంచుల్ని వాకిట్లో పిండి లోపలికి వచ్చాడు వణుకుతూ.

"ఏంది నరసరాజుగోరో ఇట్టా వచ్చిన్రు."

"మీ యమ్మకు ఎట్టుందో కనుక్కుపోదామని."

"ఏం చెప్పేది రాజుగోరో మా సంగతి. మా అమ్మ బతికేట్టులేదు." ముగ్గురు కొడుకులూ ఏడ్చారు. దాంతోపాటు ఇద్దరు కోడళ్లూ.

"ముందే ఉబ్బసం జబ్బు మనిషి. ఎట్ల బతకతది."

"అదే మాకు భయంగా ఉంది. ఇప్పుడేటి సెయ్యాల. ఈ వానల్లో ఎవుడు వైద్దెం సేత్తాడు మా అమ్మకు" బెంగపడ్డారు అన్నదమ్ములిద్దరూ. సాంబయ్య తల్లి కాళ్ల దగ్గర కూర్చుని తూగుతున్నాడు.

"ఏమి సేయిత్తరు వైద్దిగం. ఎంత కాలమని సేయిత్తరు. ఎన్ని పైసలు కర్సు పెట్టిన్రో. నానెరుగనా!"

"నిజం సెప్పినవు మావా. ఏం సేత్తం కన్నతల్లిగద మరి."

"కన్నతల్లయినా మరెవురయినా నూకలు సెల్లిపోతే పానం ఎల్లి పోతదిరా."

"అంటే ?"

"అదే నే జెప్పేది. ఇంకా నీయమ్మ ఎక్కువసేపు బతకదు. మహా బతికితే ఇంకో గెంటో, రెండు గెంటలో...."

"ఓరి నాయనో."

"ఏం బయపడమాక. ఈ సంగతిన్నా! తుపాన్లో ఎవురన్నా సచ్చిపోతే ఆళ్ల రక్త సంబంధీకులకి పదివేలు డబ్బులిస్తరు."

"అంతా ఇసిత్రం" అన్నాడు సాయమ్మ చిన్నకొడుకు.

"ఇసిత్రంగాదు, సింతకాయగాదు. మా నరసరాజన్న ఎప్పుడన్నా అబద్దాలు సెప్పి ఎరుగునా" అంది అప్పటివరకు మాగన్నుగా వింటున్న పెద్దకోడలు.

"సెబాస్. మంచి మాటన్నావు సెల్లమ్మా" మెచ్చుకొన్నాడు నరసరాజు.

"అయితే ఇప్పుడేం సెయ్యమంటవ్."

"సేసేదేం లేదు. రేపొద్దున్నే నా దగ్గరికి రా. మీయమ్మ సచ్చిపోయిందని సర్పంచికి సెప్తా. ఆయన గవర్నమెంటోళ్ళకి సెప్తడు. ఆళ్ళొచ్చి డబ్బులిస్తరు."

"అదేం అన్నాయం మావా! మనిషి సావకుండానే!" బాధపడ్డాడు రంగయ్య.

"సస్తదిలే బావా. సావక ఏడకిపోతదీ. నరసరాజన్న యింత ధైర్యంగా సెబుతా ఉంటే." సాయమ్మ చిన్నకోడలు అందుకొంది.

"ఒరే అబ్బాయిలూ, పెద్దవాన్ని. నేను సెప్పేది పూర్తిగా ఇనండి. మీ యమ్మ ఈ రాత్రికి తప్పక సచ్చిపోద్ది. సావకపోతే...." నాలుగు పక్కలా చూసిన నరసరాజు అసలు విషయం చిన్నగా అనేసాడు.

"ఓ యమ్మో...." సాయమ్మ ఇద్దరు కొడుకులూ గుండెలు బాదుకొన్నారు.

[7]

"సూడండమ్మా. నేను డబ్బొచ్చే ఉపాయం సెప్పినా. డబ్బు తీసికొంటరో, కాలదన్నుకొంటరో, నేవస్తా" అంటూ లేచాడు నరసరాజు.

"నువ్వుండన్నా ఆళ్ళతో ఏందిగాని, మేం నచ్చజెపుతంలే ఆళ్ళకి" అంటూ నరసరాజును కూర్చోబెట్టింది చిన్నకోడలు.

"ఏం మడుసులయ్యా మీరు. ఇంటి ముంగిట్లో కొచ్చిన లచ్చిమిదేవిని వదులుకొంటారా ఎవరన్నా! రోగిష్టి ముసలిదానికి సేవలు చేయలేక మేం సచ్చిపోతున్నాం. మీరు సంపాదించిందంతా వైద్దిగానికి కప్పెపెట్టి రూపాయి మిగిలిచ్చుకోలేకపోయినం. ఇంక దిష్టిబొమ్మ ఉండీ ప్రయోజనం లేక ప్రయోజనంలే" పెద్దకోడలు నిష్ఠూరంగా మాట్లాడింది.

"తల్లి గదా. ఎట్టా సేత్తం ఆ పని."

"ఎట్టా సేత్తమా. ఇట్లా" మొగుడి చెవిలో ఊదింది చిన్నకోడలు.

"ఏం బయంలే పెద్దగనే సెప్పు. ఇక్కడెవురూ పరాయోళ్ళులేరు. సాంబయ్య నిదురబోతుండడు. మన మాటలు బయటికి ఇనబడవు." పెద్ద కోడలు ధైర్యం చెప్పింది.

చిన్నకోడలు తనకు తోచిన ఉపాయం అందరికీ చెప్పింది.

అప్పుడే రాబోయే మొత్తానికి ఎవరి వాటా ఎంతో కూడా నిర్ణయం చేసుకొన్నారు. వచ్చిన పదివేలలో ఆఖరి కొడుకును వదిలేసి మిగతా ఇద్దరూ చేరి నాలుగువేలు ఉపాయం చెప్పినందుకు నరసరాజు రెండువేలు పంచుకోవాలి.

సాయమ్మ కొడుకులిద్దరూ కర్తవ్యం ఆలోచించసాగారు. తనకు జన్మనిచ్చిన తల్లిని తాము అంతం చేయబోతున్నారు. ఒకవైపు రక్త సంబంధం. ఇంకోవైపు డబ్బు. ఆ డబ్బుమీద ఆశలు పెట్టుకొన్న తమ భార్యలు.

నరసరాజు జరగబోయే దారుణాన్ని ఊహిస్తూ వాళ్ళని ప్రోత్స

హిస్తున్నాడు. వాళ్ళ భార్యలిద్దరూ ఆవరణలో పెట్టమన్నట్లు కనుసైగ చేసారు.

ఇద్దరు అన్నదమ్ములు లేచారు. మంచంమీద లావుపాటి దిండును చెరొకవైపు చేత్తో పట్టుకున్నారు. చేసే పాపాన్ని ఇద్దరూ చెరిసగం పంచుకోవాలనేది వాళ్ళ ఉద్దేశ్యం. ఆ పాపంవల్ల వచ్చే ఫలితంలాగ.

క్రింద చాపమీద భారంగా ఊపిరిపీలుస్తూ పడి ఉంది సాయమ్మ. ఆమె కాళ్ళ దగ్గర తలపెట్టుకొని ఉన్నాడు తొమ్మిదేళ్ళ సాంబయ్య.

ఇద్దరు కొడుకులూ తల్లి తల దగ్గర అటువైపు ఇటువైపు కూర్చొన్నారు. వాళ్ళ భార్యలు సంజ్ఞ చేసారు. అదే వాళ్ళకు ధైర్యం. ఊపిరి బిగపట్టి దిండును నెమ్మదిగా క్రిందికి దించసాగారు. దిండు సాయమ్మ ముఖం దగ్గరకొచ్చేసింది. క్షణంలో ఆమె బలహీన ప్రాణ వాయువులు గాలిలో కలసిపోయేవే.

ఇంతలో....

"అమ్మా" అంటూ వెర్రికేక పెట్టాడు సాంబయ్య.

ఉత్తర క్షణంలో అన్నదమ్ముల చేతిలోని దిండు అప్రయత్నంగా అంతదూరంలో ఉన్న మంచంమీద పడిపోయింది. ఇద్దరి కాళ్ళలోనూ వణుకు తమ్ముడు చూడలేదు కదా అనుకొన్నారు.

"ఏందిరా సాంబా.... ఏం జరిగింది" అన్నారు భయంగా.

"అమ్మ.... అమ్మ సచ్చిపోయినట్టు కల వొచ్చిందన్నా. అమ్మను ఇద్దరు రాచ్చసులు గొంతు పట్టుకొని నులమతుండిండ్రు. అమ్మ ఊపిరి ఆడక కాళ్ళు సేతులు కొట్టుకుంటుండింది అన్నా."

"ఆళ్ళిద్దరూ ఎట్లున్నర్రా ?"

"అళ్ళు నల్లగా ఉండరు. నోట్లోంచి నెత్తురు వస్తుండాది. పెద్ద పెద్ద కోరలు."

తృప్తిపడ్డారు ఇద్దరూ వాడు చూసింది తమను కానందుకు.

"అళ్ళు యమభటులయ్యా సాంబయ్యా. మీ యమ్మను తీసుకు పోవడానికొచ్చిర్రను" పెద్దకోడలు చెప్పింది.

"యాడికి"

"యమధర్మరాజు దగ్గరికి."

"అంటే ఏందొదినా."

"అంటే ఏంలేదు. మీ యమ్మ సచ్చిపోద్దన్నమాట. అనక మీయమ్మ మనకు కనిపించదు."

"ఓరి దేముడో అమ్మ నేకపోతే ఎట్టాగా" వెక్కెళ్ళుపెట్టి, ఏడ్చాడు సాంబయ్య.

"సాంబయ్యా ఏడవమాకయ్యా. అమ్మ సచ్చిపోదు. లేవయ్యా. నువ్వు పడుకో" చిన్నకోడలు బుజ్జగించింది.

ఎవరెంత అనునయించినా వినకుండా ఆ రాత్రంతా మేలుకొని తల్లిని చూస్తూ ఏడుస్తూనే ఉన్నాడు.

అన్నలిద్దరూ తల్లిని చంపే ప్రయత్నం మానుకొన్నారు. వదినలిద్దరూ ఏం చేయలేక నిస్సహాయంగా సాంబయ్యనే కొరకొరా చూస్తూ ఉండిపోయారు. సాంబయ్య పడుకొంటే తమ పని పూర్తి చేయాలని స్మశానంలోని నక్కల్లా రాత్రంతా జాగారం చేసారు. కాని వాళ్ళ కోరిక తీరలేదు.

ఉదయానికల్లా సాయమ్మ ప్రాణాలు గట్టున పడ్డాయి. తుఫాను కూడా తగ్గిపోయి వాతావరణం తేలిగ్గా మారింది. సాయమ్మ ఆరోగ్యం కుదుటపడింది.

దాంతో సాయమ్మ, కోడళ్ళిద్దరికీ, కొడుకులిద్దరికీ అకారణంగా శతృవయిపోయింది. తాము తెచ్చే సంపాదనంతా అనవసరంగా తల్లి బాగోగు

లకు ఖర్చుపెడుతున్నామని అనుకోసాగారు కొడుకులు. తాము ఈ ముసలి దానికి సేవలు చేయాల్సివచ్చిందే అని కోడళ్ళు విసుక్కోసాగారు. అయితే ముసలిదయినా సాయమ్మ ఉదయాన్నే వెళ్ళి గడ్డి కోసుకొచ్చేది. మధ్యాహ్నం ఎండ తగ్గిన తరువాత అడవిలోకి వెళ్ళి కట్టిపుల్లలు ఏరుకొని వచ్చేది. సాంబయ్య ఆవుల్ని తోలుకువెళ్ళి మేపుకొచ్చేవాడు.

సాయమ్మ కోడళ్ళ రుసరుసలు, కొడుకుల విసుగుదల గమనించి బాధపడసాగింది. ఇక వాళ్ళతో కలిసి వుండడం కష్టమనిపించి ఊళ్లో నలుగురు పెద్దల్ని పిలిచి ఆస్తులు పంపకాలు పెట్టించింది. కోడళ్ళు సంతోషించారు. కొడుకులు ఏమీ ఎరుగనట్లు మౌనంగా ఊరుకొన్నారు. పంపకాల్లో ముగ్గురు కొడుకులుకు మూడెకరాలు సాయమ్మకు ఒక ఎకరం పొలం వచ్చింది. సాంబయ్య చిన్నవాడు కాబట్టి తల్లితోనే వుండాలని నిర్ణయించారు. ఇంటిస్థలాలు కూడా పంచుకున్నారు. మూడు కుటుంబాల వారు మూడుచోట్ల ఇళ్ళు వేసుకున్నారు.

ఆనాటినుంచి సాయమ్మ తమ రెండెకరాల పొలాన్ని సాగుచేయించు కొంటూ సాంబయ్య బాగోగులు చూస్తూ రోజులు నెట్టుకొస్తోంది.

*   *   *   *

ఇదీ గతంలో జరిగింది....

ప్రస్తుతం విషమ పరిస్థితిలో ఉన్న తల్లి విషయం చెప్పడానికి అన్నల దగ్గరకు పరుగెత్తాడు సాంబయ్య.

సాంబయ్య అటు వెళ్ళగానే భర్తతో గట్టిగా చెప్పేసింది పెద్ద కోడలు.

"ఏమయ్యోయ్. ఎట్టాగయినా మీ అమ్మ సావడానికి ఈల్లేదు. రాత్రంతా మేలుకొని కూసొని సేవలుసెయ్. ఎట్టాగయినా ఆమె బతకాల. తెల్లారిందాకా కాపాడినవంటే అనక ఇబ్బందిలే. ఉదయాన్నే నేను వచ్చి

కాఫీ ఇచ్చి అన్ని ఇసయాలూ సూసుకొంటా" అంటూ జాగ్రత్తలు చెప్పి భర్తను సాగనంపింది.

'ఎలాగయినా సాయమ్మత్త సావగూడదు దేముడా! నీ కొండ కొస్తా' అంటూ దేవుడ్ని ప్రార్థిస్తూ ముడుపులు కట్టసాగింది.

సాంబయ్య చిన్నన్న ఇంటికి వచ్చేసరికి గోడ ప్రక్కనే గోనె నంచి కప్పుకొని అటు తిరిగి ఒంటికి పోసుకుంటుందో ఆకారం.

"ఎవురా మడిసి" అన్నాడు సాంబయ్య భయంగా.

వెనక్కు తిరిగి చూసిన ఆ ఆకారం లేచి నిలబడి "ఏందిరా సాంబా యిట్టా వచ్చినవు" అంది.

"అన్నా. అమ్మ సలిజెరంతా వణకతా ఉండది. నీతో మాట్లాడా లంట. పెద్దన్నతో ఇప్పుడే సెప్పొచ్చినా" అన్నాడు చలికి ముడుచుకు పోతూ.

'బొంయ్, మని గాలి సుడులు తిరుగుతూ వచ్చింది.

సాంబయ్య నెత్తిమీద గోనె ఎగిరి ఆ చీకట్లో ఎక్కడో పడి పోయింది. భయంకరమైన ఉరుము. వెనుకనే మెరుపు. మెరుపుకాంతి చూడ్లేక కళ్ళు మూసుకున్నాడు సాంబయ్య.

"నువ్వు పోరా. ఇంట్లోజెప్పి నే వస్తా" అంటూ లోపలికి వెళ్ళాడు నరసయ్య.

సాంబయ్య నెత్తిమీద నుంచి ఎగిరిపోయిన గోనెసంచిని చీకట్లో వెతకలేక నెత్తిన రెండు చేతులూ పెట్టుకొని నడుస్తున్నాడు.

ఇద్దరు అన్నలకు చెప్పిన తరువాత వాడి కంటికి ఇపుడు "ఒరే సాంబా పోతున్నానురా....వెళ్ళిపోతున్నానురా. ఒక్కసారి రారా" అని పిలుస్తోన్న తల్లి రూపం స్పష్టంగా కనిపిస్తోంది. గుండెలోంచి దుఃఖం

తన్నుకువస్తోంది. ఏడుస్తూ, వెక్కిళ్ళు పెడుతూ వర్షంలో తడుస్తూ పరుగెత్తినట్లు నడుస్తున్నాడు. కాళ్ళు బురదలో కూరుకుపోతున్నాయి.

*　　*　　*　　*

సాయమ్మను చూడ్డానికి రాలేనని చెప్పిన పెద్దకోడలులాగే చిన్న కోడలు కూడా ఎలాగయినా అత్తను చావకుండా చూడమని భర్తను హెచ్చరించి పంపింది. అంతో ఇంతో తిని దుప్పటి కప్పుకొని వెచ్చగా ఇంట్లో పడుకొంది. గత తుఫానులో సాయమ్మ చావకపోవడంవల్ల తను పెట్టుకొన్న ఆశలు ఎలా నెరవేరకపోయింది తలచుకొని దుఃఖిస్తూ ఉంది. సాయమ్మ తుఫాను అయేంత వరకు చావకపోతే తను భర్తతో కొండకు వస్తానని తిరుపతి వెంకటేశ్వరస్వామికి మొక్కుకొంది.

తమ భర్తలు, మరిది వెళ్లేసరికి సాయమ్మ చచ్చిపోయి ఉంటుందని, మరునటిరోజు ప్రభుత్వం పదివేల రూపాయలు శాంక్షను చేసి సాంబయ్య మైనరయినందున అతని పేర ఆ మొత్తాన్ని బ్యాంకులో వేస్తారని తెలుసుంటే వాళ్ళు తమ భర్తలను బయటికి పంపేవారు కాదేమో!

ఆ యదార్థం తెలిసిన తరువాత వాళ్ళ గుండెలు తపనతో ఎలా కొట్టుకుంటాయో ?

**